సాక్షి చిత్తూరు

బుధవారం । 28 । జూన్ । 2023



ట'మోత'!

టమాట ధరలు అమాంతం పెరగడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోళ్లు పుంజుకున్నాయి. – 8లో



రేపటి నుంచి చతుర్వేద హవనం

తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం వెనుక మైదానంలో రేపటి నుంచి శ్రీనివాస చతుర్వేద హవనం నిర్వహించనున్నారు. – 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	26
తిరుపతి	38	26
తిరుమల	33	22
గూడూరు	39	28
నగరి	38	27

న్యూస్‌రీల్

జూలై 4న జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు అర్బన్/చిత్తూరు కలెక్టరేట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూలై 4వ తేదీన జిల్లాలో పర్యటించనున్నట్లు అధికారులు ప్రకటించారు. మంగళవారం ఈ మేరకు బహిరంగ సభా ప్రాంగణం, హెలీ ప్యాడ్, పార్కింగ్ స్థలాలను కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చిత్తూరులో అమూల్ పాలసేకరణ యూనిట్‌కు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. చీలాపల్లెలోని సీఎంసీ ఆస్పత్రి వద్ద మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో సీఎం పర్యటనకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్డీఓ రేణుక, తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

బోయకొండలో గోబర్ గ్యాస్ ప్లాంట్



అధికారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె : బోయకొండలో రూ.50లక్షలు వెచ్చించి గోబర్ గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మంగళవారం ఈ మేరకు బోయకొండలోని గోశాల సమీపంలో ప్లాంట్ కోసం స్థల పరిశీలన చేపట్టారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ అమ్మవారి మొక్కుబడి చెల్లించేందుకు భక్తులు కట్టెల పొయ్యిలను వినియోగిస్తున్నారని, వారికి ఇబ్బంది లేకుండా గోబర్ గ్యాస్ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆలయం వద్ద చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, హార్టికల్చర్ డీడీ మధుసూదనరెడ్డి, ఈఓ చంద్రమౌళి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, సర్వేయర్ మురళీకృష్ణ, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూ రమణ, నేతలు సురేంద్రరెడ్డి, గంగిరెడ్డి, వెంకటరెడ్డి, డిష్ సూరి పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం,, విద్య, వైద్యం, సంక్షేమం తదితర అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. స్థాయీ సంఘాల సభ్యులందరికీ ఆహ్వానం పంపించామని, జిల్లా అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి రావాలని స్పష్టం చేశారు.

సిరులు కురిపించే చిరుధాన్యాలు



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్నేషన్ మిల్లెట్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పుంగనూరులో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సిరులు కురిపించే చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 5వేల ఎకరాల్లో రాగి పంట సాగు చేస్తున్నారని, మరో 10వేల ఎకరాల్లో సాగు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఉపాధి హామీ కింద అంతర పంటగా 6వేల ఎకరాల్లో రాగి సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఇందుకు గాను రూ.3వేలు అందించాలని డ్వామా పీడీకి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. రైతుల నుంచి కిలో రాగిని రూ.38 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. రేషన్ దుకాణాల ద్వారా రాగులను ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పాల్గొన్నారు.



రామకుప్పం బహిరంగ సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సుపరిపాలనకే ఓటు

"ప్రజా సేవే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుక్షణం పరితపిస్తుంటారు.. పేదల సంక్షేమమే లక్ష్యంగా విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టారు.. అన్ని వర్గాల అభ్యున్నతికి నిత్యం కృషి చేస్తుంటారు.. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తుంటారు.. రాష్ట్రాభివృద్ధికే తొలి ప్రాధాన్యమిస్తూ శ్రమిస్తుంటారు.. అయితే చంద్రబాబు ఇందుకు పూర్తి విరుద్ధంగా నడుచుకుంటారు.. ప్రజల ఓట్లే పరమావధిగా అనుక్షణం మోసం చేస్తుంటారు.. నిరుపేదల కష్టాలను చులకనగా చూస్తుంటారు.. సంపన్న వర్గాలకు అనుకూలంగానే పనిచేస్తుంటారు.. దిగజారుడు రాజకీయాలతో ప్రజాతీర్పునే పరిహాసం చేస్తుంటారు.. వ్యక్తిగత అజెండాకే ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాభివృద్ధికి మోకాలడ్డుతుంటారు.. మాట మీద నిలబడే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి.. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కే చంద్రబాబుకు ఇదీ తేడా" అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వివరించారు.

- పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- చంద్రబాబువి మాయమాటలు
- 35 ఏళ్లుగా కుప్పం నియోజకవర్గానికి చేసింది శూన్యం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యం
- రామకుప్పం పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం/రామకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకే ప్రజలు ఓటేస్తారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం రామకుప్పం మండలంలో పల్లెబాట నిర్వహించారు. అందులో భాగంగా 89 పెద్దూరు, ననియాల తాండ, వీర్నమల, బళ్ల, ఉన్సిగానినూరు, విజలాపురం, కంచనబళ్ల, రామకుప్పంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వెల్లడించారు. పేద పిల్లలు సైతం సౌకర్యవంతంగా చదువుకునేందుకు నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారని చెప్పారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాల్లో అమ్మఒడి కింద ఏటా రూ.15వేలు జమ చేస్తున్నారని తెలిపారు. పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను రూపొందించారని వివరించారు. నాలుగేళ్ల సుపరిపాలనకు.. కల్లబొల్లి మాటలు చెప్పే చంద్రబాబు హయాంకు తేడాను ప్రజలు గుర్తించాలని కోరారు. కుట్రలు, కుతంత్రాలతో రాజకీయాలను దిగజార్చిన చంద్రబాబుకు ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పడం తథ్యమని స్పష్టం చేశారు.

చంద్రబాబుది దశాబ్దాల మోసం

కుప్పం ప్రజల ఓట్లతో 35 ఏళ్లుగా గెలుపొందిన చంద్రబాబు దశాబ్దాలుగా నియోజకవర్గ వాసులను మోసం చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి విమర్శించారు. దేశంలోనే సీనియర్‌ని అని చెప్పుకునే చంద్రబాబు ఏనాడైనా సొంత నియోజకవర్గంలో ఒక్క పంచాయతీ అయినా తిరిగారా అని ప్రశ్నించారు. ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టి, తర్వాత పట్టించుకోరని ఆరోపించారు.

బాబుది బూటకపు మేనిఫెస్టో

2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అప్పట్లోనే చంద్రబాబు కాపీ కొట్టారని, ఇప్పుడు కూడా మళ్లీ బూటకపు మేనిఫెస్టోను ప్రకటిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి మండిపడ్డారు. గతంలో అమ్మఒడి నాన్న బుడ్డి అని హేళన చేసిన బాబు, ఇప్పుడు పిల్లలను బడికి పంపితే అమ్మకు వందనం అందిస్తామంటూ మళ్లీ వైఎస్సార్‌సీపీనే కాపీ కొడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మరో రెండు మేనిఫెస్టోలను విడుదల చేస్తామంటున్న చంద్రబాబు.. అందులో మహిళలకు కేజీ బంగారం, రైతుకు ట్రాక్టర్, యువతకు బుల్లెట్ బైక్‌లను పంపిణీ చేస్తామన్న పథకాలను పేర్కొన్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. ఇచ్చిన మాట నెరవేర్చే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి.. అబద్ధపు హామీలు గుప్పించే చంద్రబాబుకు తేడాను కుప్పం ప్రజలు గుర్తించాలని సూచించారు.

ఏరు దాటాక తెప్ప తగులబెట్టినట్లు చంద్రబాబు వ్యవహారశైలి ఉంటుందని తెలిపారు. కుప్పం పర్యటనకు అప్పుడప్పుడు వచ్చి తూతూమంత్రంగా రెండు సభల్లో మాట్లాడి మళ్లీ హైదరాబాద్‌కు చెక్కేస్తారని ఎద్దేవా చేశారు.

4రోజులు.. 40 సభలు

కుప్పం నియోజకవర్గం గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో నాలుగు రోజులపాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పల్లెబాట నిర్వహించారు. ప్రతి చోటా జనంతో మమేకమవుతూ.. ప్రజా సమస్యలపై స్పందిస్తూ.. వారి భవిష్యత్‌కు భరోసానిస్తూ పర్యటించారు. మంత్రి పెద్దిరెడ్డి పర్యటనకు.. చుట్టంచూపుగా వచ్చే చంద్రబాబుకు తేడాను కుప్పంవాసులు స్పష్టంగా గమనించారు. ఇటీవల 3 రోజులపాటు చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. ఒక్క బహిరంగసభలో మాత్రమే పాల్గొన్నారు. కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే మంత్రి పెద్దిరెడ్డి తన నాలుగురోజుల పర్యటనలో ప్రజల యోగక్షేమాలు, అవసరాలు తెలుసుకునేందుకే ప్రాధాన్యమిచ్చారు. గుడుపల్లె మండలంలో 17, రామకుప్పం మండలంలో 16 బహిరంగ సభల్లో ప్రసంగించారు. ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

అడుగడుగునా నీరా'జనం'

మంత్రి పెద్దిరెడ్డి పర్యటనకు జనం నుంచి విశేష స్పందన లభించింది. మహిళలు అడుగడుగునా నీరాజనాలు పట్టారు. కొడతనపల్లెలో భూమి పట్టాలు పొందిన 230 రైతు కుటుంబాలు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలపడం విశేషం. నాగభూషణం, వెంకటరెడ్డి యాదవ్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఎంపీ రెడ్డెప్ప : ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పల్లెబాటతో ముందుకు వచ్చారు. తర్వాత మీ ఇంటికి మీ మంత్రి పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడతారు.

ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం : 50శాతం రిజర్వేషన్లకు గతంలో బీసీలు పోరాడారు. అయితే జగనన్న 64శాతం రిజర్వేషన్లు అందిస్తున్నారు. బీసీలందరూ ఈ విషయాన్ని గుర్తించాలి.

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మంచి కార్యక్రమాలు చూసి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలి.

ఎమ్మెల్సీ భరత్ : కుప్పం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం. ఏ సమస్య వచ్చినా.. అర్ధరాత్రి తలుపు తట్టినా అండగా నిలుస్తాం.

టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ : టీడీపీ నేతలు నాలుగు దశాబ్దాలుగా కుప్పం ప్రజలను మోసం చేస్తున్నారు.



ఉన్సిగానిపల్లెలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తూ..



గజమాలతో ఘన స్వాగతం అందుకుంటూ..



రామకుప్పం సభలో జనసందోహం

పొదుపు రుణాలపై సమావేశం

చిత్తూరు అగ్రికల్చర్: డ్వాక్రా సంఘాల మహిళలకు రుణాలు మంజూరు చేయడంపై బ్యాంకర్లతో మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పీడీ తులసి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ క్రమంలో బ్యాంకర్లు సహకరించి సకాలంలో రుణాలు మంజూరు చేయాలని కోరారు. మహిళలు చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు పూచీకత్తు లేకుండా వ్యక్తిగత రుణాలు అందించాలని సూచించారు. ఎల్‌డీఎం హరీష్ మాట్లాడు తూ సహకార రంగాలకు రుణాలు మంజూరు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

గురుకుల ప్రవేశ పరీక్షలకు 243 మంది హాజరు

పూతలపట్టు: బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6 నుంచి 9వ తరగతిలో ప్రవేశానికి మంగళవారం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 243 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు. 77 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.

బాధ్యతగా మెరుగైన వైద్యసేవలు

చిత్తూరు రూరల్: బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఐఓ రవిరాజు ఆదేశించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎంపీహెచ్‌ఓలు, సూపర్‌వైజర్లు, సీహెచ్‌ఓలతో సమావేశం నిర్వహించారు. డీఐఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్యసేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. మాతాశిశు మరణాలను అరికట్టేందుకు గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీపీఎంఓ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

సమపాళ్లలో సంక్షేమం.. అభివృద్ధి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమ పథకాలను సమపాళ్లలో అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మంగళవారం కడపగుంట, దళితవాడ, బొమ్మరమిట్టి, మూర్తినాయునిపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పేదల కళ్లలో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. నాలుగేళ్ల పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై జగనన్నకు అవగాహన ఉందని, అందుకే అధికారంలోకి రాగానే విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వెల్లడించారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాల ని స్పష్టం చేశారు. చంద్రబాబుకు ఓటేస్తే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జి, ఎంపీటీసీ సభ్యులు ఉమామహేశ్వరి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పుష్పరాజ్, తహసీల్దార్ ఇన్బనాథన్, ఎంపీడీఓ శ్రీదేవి, ఐకేపీ ఏపీఎం చిరంజీవి, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, పార్టీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, జేఎంసీ చైర్మన్ బండి కమలాకర్ రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మణి పాల్గొన్నారు.

చంద్రబాబే దళిత ద్రోహి

- బాబును అధికారంలోకి తెచ్చేందుకు జగనన్నపై రామోజీ పిచ్చిరాతలు
- రామోజీ దిష్టిబొమ్మ, ఈనాడు ప్రతుల దహనం



రామోజీని దున్నతో పోలుస్తూ వినూత్న నిరసన



రామోజీరావు దిష్టిబొమ్మను పాడెపై ఊరేగిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం : చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో దళితులను విస్మరించడంతో పాటు దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా..? అంటూ అవహేళన చేసిన ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ 'ఏలుబడిలో నెలకు ముగ్గురు ఎస్సీ, ఎస్టీలు హతం' శీర్షికన మంగళవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. జగనన్న పాలనలోనే దళితులపై హత్యలు జరుగుతున్నాయని పిచ్చిరాతలు రాయిస్తావా? రామోజీ అంటూ మండిపడ్డారు. ఆపై ఈనాడు యాజమాన్యాన్ని దున్నపోతుతో పోలుస్తూ తిరుపతి ఆటోనగర్ వద్ద రామోజీ దిష్టిబొమ్మతో పాటు ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబును ఎలాగైనా అధికారంలోకి తీసుకురావాలన్న దురాలోచనతో రామోజీ పత్రికా విలువలను దిగజారుస్తున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు కథనాలు ప్రచురించడం దారుణమన్నారు.

జగనన్న హయాంలోనే ఆత్మగౌరవం

జగనన్న అధికారంలోకి వచ్చాకే దళితుల ఆత్మగౌరవం పెరిగిందని, ఉన్నత పదవులు అధిరోహించ గలిగారని అజయ్‌కుమార్ తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలతో దళితులు ఎంతో సుభిక్షంగా జీవిస్తున్న విషయం రామోజీరావ్‌కు కనిపించలేదా? అని ప్రశ్నించారు. జగనన్నపై తప్పుడు కథనాలు ప్రచురిస్తే ఈనాడు పత్రికను, చంద్రబాబును ప్రజలు ఛీకొడతారే తప్ప నమ్మేస్థితిలో లేరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో కూడా దళితులంతా జగనన్నను తిరిగి సీఎంగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మరోసారి ఇలాంటి తప్పుడు కథనాలు రాస్తే ఖబడ్దార్ రామోజీ అంటూ హెచ్చరించారు. కార్పొరేటర్లు హనుమంత్‌నాయక్, కోటూరు ఆంజినేయులు, 1వ డివిజన్ అధ్యక్షుడు ఆదం సాయికుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు బొగ్గుల వెంకటేష్, శ్యామల, దాస్ పాల్గొన్నారు.

పిల్లల భవితకు భరోసా

- నేడు నాలుగో విడత అమ్మఒడి
- 2,44,706 మంది విద్యార్థులకు లబ్ధి
- 1,52,542 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.228.81 కోట్లు



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : "చదువుకు పేదరికం అడ్డు కాకూడదు.. బడిబయట ఒక్క బిడ్డ కూడా ఉండకూడదు.. పిల్లలను పాఠశాలకు పంపే ప్రతి తల్లికీ ఆర్థిక భరోసా కల్పించాలి".. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15వేలు జమ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం నాలుగో విడత అమ్మఒడిని ప్రారంభించనున్నారు. చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు.

పారదర్శకంగా నగదు పంపిణీ

జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాలకు సంబంధించి 2,902 పాఠశాలలు ఉన్నాయి. అందులో ఒకటి నుంచి పదో తరగతి వరకు 2,39,201 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 150 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలున్నాయి. 45,789 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరిలో 2,44,706 మంది విద్యార్థులు అమ్మఒడి పథకానికి అర్హత పొందారు. ఈ మేరకు వారి తల్లులు మొత్తం 1,52,542 మంది ఖాతాల్లో రూ.228.81 కోట్లు జమ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది.

మండల స్థాయిలో వారోత్సవాలు

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 30 నుంచి జూలై 7వ తేదీ వరకు మండల స్థాయిలో అమ్మఒడి వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అర్హులందరికీ అందేలా చర్యలు



జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ అమ్మఒడి పథకం అందేలా చర్యలు చేపట్టాం. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోంది. పేదరికం విద్యకు అడ్డుగా మారకుండా ఉండేందుకు అమ్మఒడిని అమలు చేస్తోంది. – షణ్మోహన్, కలెక్టర్

పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లా స్థాయిలో నాలుగో విడత అమ్మఒడి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను ఆహ్వానించాం. అర్హులందరికీ పథకం అందించేందుకు పటిష్టంగా కసరత్తు చేశాం.– విజయేంద్రరావు, డీఈఓ

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 73,156 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,175 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీ ద్వారా రూ.4.29 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ భక్తులకు సకాలంలో దర్శనం అవుతోంది. టికెట్లు లేని భక్తులకు 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

3 నుంచి భాగవత ప్రవచనాలు

తిరుమల : టీటీడీ చేపట్టిన పారాయణ యజ్ఞంలో భాగంగా జూలై మూడవ తేదీన తిరుమల నాదనీరాజనం వేదికపై శ్రీమద్ భాగవతం ప్రవచన కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. కాగా, ఈ ఏడాది జనవరి రెండవ తేదీన ప్రారంభమైన గరుడ పురాణ పారాయణం జూలై రెండో తేదీన ముగియనుంది. నాదనీరాజనం వేదికపై సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్య శ్రీమద్ భాగవతం కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు కుప్పా విశ్వనాథ శర్మ ప్రవచనం చేస్తారు. ధర్మగిరి వేద వి/్ఞాన పీఠం శాస్త్ర పండితులు కేవీ.శేషాచార్యులు, పీవీఎస్ ఎన్.మారుతి శ్లోక పారాయణం చేయనున్నారు.

మేయర్ హత్య కేసులో పిటిషన్ కొట్టివేత

చిత్తూరు అర్బన్: మేయర్ అనురాధ, ఆమె భర్త హత్య కేసులో ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం మంగళవారం కొట్టేసింది. 2015లో జరిగిన జంట హత్యల అనంతరం ప్రధాన నిందితుడు చింటూ టోల్‌ప్లాజాలు దాటుకుంటూ పారిపోయాడని, ఆ వీడియోలను కోర్టులో ప్రదర్శించాలని ప్రాసిక్యూషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి శాంతి సదరు పిటిషన్‌ను తోసిపుచ్చారు.

ట'మోత'!



- రూ.వెయ్యి దాటిన బాక్సు టమాట
- పలమనేరు మార్కెట్‌లో అధికంగా రూ.1,050
- పొరుగు రాష్ట్రాల్లో తగ్గిన సరుకు
- జిల్లాకు తరలివస్తున్న వ్యాపారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పలమనేరు : జిల్లాలోని మార్కెట్లలో టమాటా ధర ఆశాజనకంగా పెరుగుతోంది. పది రోజుల్లోనే బాక్సు టమాటా రూ.వెయ్యి నుంచి రూ.1,050 వరకు పలుకుతోంది. బయటి రాష్ట్రాలనుంచి వ్యాపారు లు జిల్లాలోని మార్కెట్లకు వస్తుండడంతో పంట హాట్ కేక్‌లా అమ్ముడవుతోంది. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులో టమాటా పూర్తిగా తగ్గిపోవడంతో అక్కడి వ్యాపారులు జిల్లాకు క్యూ కడుతు న్నారు. కర్ణాటకలో కొద్దోగొప్పో పంట ఉన్నా.. అది తెగుళ్ల బారిన పడడంతో కొనుగోళ్లు తగ్గిపోయాయి. ఏది ఏమైనా ఇన్నాళ్లుగా కుదేలైన టమాటా రైతు ఇప్పుడు ఆనందంగా కోతకు దిగుతున్నాడు. గిట్టుబాటు ధర దక్కుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

వ్యాపారుల చూపు జిల్లావైపే..!

జిల్లాలోనే టమాటా సాగు ఎక్కువగా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో ఉంది. పలమనేరు, పుంగనూరు, వి.కోట, సోమల, సదుంలో టమాటా మార్కెట్లున్నాయి. గత సీజన్‌లో టమాటాకు ఆశించిన ధర లేదు. దీంతో ఈదఫా రైతులు పూర్తి స్థాయిలో టమాటా సాగు చేపట్టలేదు. ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ఇక్కడి మార్కెట్లకు 200 లోడ్ల టమాటాలు రావాల్సి ఉండగా ఇప్పుడు వంద లోడ్లు మాత్రమే వస్తున్నాయి. ఇదే సమయంలో మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో టమాటాలు లేవు. కోలారు జిల్లాలో వైరస్ కారణంగా పంట దిగుబడి పడిపోయింది. దీంతో బయటి రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడి మార్కెట్లకు వస్తున్నారు. కావాల్సినంత సరఫరా లేకపోవడంతో టమాటాకు డిమాండ్ పెరిగింది.

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో టమాట సాగు వివరాలు

సాధారణ సాగు	:	5వేల హెక్టార్లు
ప్రస్తుతం సాగైన పంట	:	4వేల హెక్టార్లు
కోతదశలో ఉన్నవి	:	2వేల హెక్టార్లు
ఈ సీజన్‌లో మండీలకు వచ్చే సరుకు	:	200 లారీ లోడ్లు
ప్రస్తుతం మార్కెట్లకు వస్తున్న సరుకు	:	100 లోడ్లు

ధరల సమాచారం

ఏప్రిల్‌లో బాక్సు టమాట ధర

తొలి వారం	:	రూ.50
రెండో వారం	:	రూ.100
మూడో వారం	:	రూ.120
నాలుగో వారం	:	రూ.150

మేలో ధరల వివరాలు

తొలి వారం	:	రూ.60
రెండో వారం	:	రూ.120
మూడో వారం	:	రూ.200
నాలుగో వారం	:	రూ.200

జూన్‌లో ధరలు

తొలి వారం	:	రూ.300
రెండో వారం	:	రూ.450
మూడో వారం		రూ.750
నాలుగో వారం	:	రూ.1,050

కష్టాలు తీరినట్టే



ప్రస్తుతం నేను 12 ఎకరాల్లో టమాటా సాగుచేశా. ఇప్పుడే కోతలు మొదలైయ్యాయి. బాక్సు ధర రూ.900 నుంచి రూ.1000దాకా పలుకుతోంది.ఇంత మాత్రం ధర ఇంకో నెల ఉంటే రైతుల కష్టాలు తీరినట్టే. స్థానికంగానూ వైరస్ కారణంగా తోటలకు నష్టం వచ్చినా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో తోట నిలిచింది.

- విజయభాస్కర్ రెడ్డి, రైతు, గోనుమాకులపల్లె, పెద్దపంజాణి మండలం

ఆశాజనకంగా ధర



బయట రాష్ట్రాల్లో టమాటాలు లేకపోవడంతో స్థానికంగానూ సరుకు తక్కువగా ఉండడంతో టమాటాకు ధర వచ్చింది. ఈ నెలంతా ధరలు ఆశాజనకంగా ఉండే అవకాశం ఉంది. ఇప్పుడు పిందె, కోత దశలో ఉన్న తోటలకు సైతం ధరలు బాగానే ఉండొచ్చు. ఇదే విధంగా ధరలు కొనసాగితే సంతోషమే.

- అఫ్జల్, మండీ నిర్వాహకుడు, పలమనేరు



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73.00

అంతర్రాష్ట్ర రహదారిలో ట్రాఫిక్ జామ్



రోడ్డుపై నిలిచిన లారీలు

యాదమరి: మండలంలోని వట్రపల్లె క్రాస్ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై మంగళవారం ఉదయం ఓ పాల ట్యాంకర్ ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో ఇరువైపులా కిలోమీటర్ల మేరక వాహనాలు నిలిచిపోయాయి. జేసీబీ సాయంతో ఇరుక్కుపోయిన ట్యాంకర్‌ను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించా రు. రోడ్డు గుంతలమయంగా మారినా అధికా రులు పట్టించుకోకపోవడంవల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్మశానవాటికల స్థల సేకరణ వేగవంతం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీల కోసం శ్మశానవాటికలు ఏర్పాటు చేసేందుకు స్థలాల సేకరణను వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జూలై 3 వ తేదీ నాటికిశ్మశాన వాటికల కోసం గుర్తించిన భూములపై వెంటనే నివేదికలు పంపించాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్‌ఓ రాజశేఖర్, సర్వే శాఖ ఏడీ గౌస్ భాషా, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మురళి, వాసు, పద్మజ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు నేడు అవగాహన సదస్సు

చిత్తూరు కలెక్టరేట్ : హెచ్‌సీఎల్ టెక్ బీ కార్యక్రమం కింద విద్యార్థుల తల్లిదండ్రులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే తల్లిదండ్రులతో సమావేశమవుతున్నట్లు వివరించారు. చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో మధ్యాహ్నం 3 గంటలకు సదస్సు ప్రారంభవుతుందని వెల్లడించారు.

ట్రాన్స్‌జెండర్లకూ సమాన హక్కులు



మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: చట్టంలో ట్రాన్స్‌జెండర్లకు (హిజ్రా)సైతం సమాన హక్కులు కల్పించారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ తెలిపారు. మంగళవారం చిత్తూరులోని న్యాయసేవాసదన్ భవనంలో ట్రాన్స్‌జెండర్ల పరిరక్షణ, హక్కులపై సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ హిజ్రాలను ఎవరూ చులకనగా చూడకూడదని కోరారు. వారు గౌరవంగా జీవించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తిరుపతి దిశ డీఎస్పీ కాటమరాజు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనలో కళాకారుడి మృతి



రామచంద్రయ్య (ఫైల్)

సదుం: నాటక ప్రదర్శనలో కళాకారుడు మృతి చెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు..మండలంలోని భట్టువారిపల్లె భారతంమిట్ట వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి వారు నాటక ప్రదర్శన చేపట్టారు. అందులో దుర్యోధన పాత్రధారి గాదేవారిపల్లెకు చెందిన రామచంద్రయ్య(55) పద్యాలు ఆలపిస్తూ ఛాతీలో నొప్పి రావడంతో వెళ్లి పడుకున్నాడు. కాసేపటికి కన్నుమూశాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల ప్రభుత్వాస్పత్రి సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. రొంపిచెర్లకు చెందిన షమీవుల్లా తన భార్య తస్లీం (35)తో కలిసి బైక్‌పై చీలాపల్లె వద్ద సీఎంసీ ఆస్పత్రికి బయలుదేరాడు. మార్గం మధ్యలో తస్లీం వేసకున్న బురఖా చున్నీ బైక్ వెనుక చక్రంలో చిక్కుకోవడంతో ఆమె కింద పడిపోయింది. తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ విశ్వనాథం తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



రాధ మృతదేహం

పూతలపట్టు: మండలంలోని ఆకనంబట్టు పంచాయతీ రంగాపురంలో మంగళవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు గ్రామానికి చెందిన యువరాజులు, రాధ(23)కు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు. యువరాజు కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రాధ తన పుట్టింటి వారి ఊరిలో జరుగుతున్న జాతరకు వెళ్లాలని భర్తను కోరింది. దీనికి అతడు నిరాకరించడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగేసింది. కుటుంబసభ్యులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. భార్య మృతి చెందిన విషయం తెలియడంతో భర్త యువరాజులు సైతం పురుగుల మందు తాగేశాడు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఏఎస్ఐ లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం



మృతి చెందిన వాణి

– భర్తకు తీవ్రగాయాలు

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి కూడలి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు నవాబుపేటకు చెందిన కావాలి వాణి(35) మృతి చెందింది. ఆమె భర్త రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వాణి, రమేష్ సత్యవేడులో జరుగుతున్న బంధువుల పెళ్లికి వెళ్లేందుకు నెల్లూరు నుంచి మోటార్ బైక్‌లో బయలు దేరారు. మార్గ మధ్యలో పండ్లూరు కూడలి వద్ద మోటార్‌బైక్‌ను వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న లారీ మోటార్ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో వాణి రెండు కాళ్లు పూర్తి నలిగిపోయి తీవ్రంగా గాయపడింది. రమేష్‌కు కూడ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వాణిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో 108 లో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. మార్గమధ్యంలో ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. రమేష్‌ను నెల్లూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న దయతో 25 ఏళ్ల తరువాత..



ఉపాధ్యాయుడు రమణయ్య దంపతులకు సత్కారం

వాకాడు : 1998 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి.. 25 ఏళ్లుగా వివిధ రకాల కష్టాలను ఎదుర్కోని నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయతో మండలంలోని నెల్లిపూడి గ్రామానికి చెందిన నూతలపాటి రమణయ్య ప్రవేట్ గుమస్తా నుంచి టీచర్‌గా మారారు. ఈ సందర్భంగా శ్రీరామసేవ ఆధ్వర్యంలో బాలిరెడ్డిపాళెం శ్రీపట్టాభిరామాలయంలో నూతన ఉపాధ్యాయుడు రమణయ్య దంపతులను సత్కరించారు. వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి చేతులు మీదుగా సన్మానించారు. అర్చకుడు దీవి అనంతాచార్యులు, సభ్యులు హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని డీఆర్‌ఓ రాజశేఖర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఓటర్ల సవరణ కసరత్తుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ప్రముఖుల పేర్లు ఉన్నాయో.. లేదో జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. నిబంధనల మేరకు బీఎల్‌ఓలు కసరత్తు చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 15 వేల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఆగస్టు 20వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించాలన్నారు. మరణించిన వ్యక్తుల పేర్లు జాబితాలో ఉంటే తొలగించాలని కోరారు. కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బ్యూలా, సిబ్బంది ఉమాపతి, మనోజ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి చతుర్వేద హవనం

తిరుపతి కల్చరల్: లోక కల్యాణార్థం గురువారం నుంచి జూలై 5వ తేదీ వరకు టీటీడీ పరిపాలన భవనం వెనుక వైపు ఉన్న మైదానంలో శ్రీశ్రీనివాస చతుర్వేద హవనం జరుగనుంది. తిరుపతిలో టీటీడీ తొలిసారిగా ఈ హవనం చేపడుతోంది. ఈ మేరకు అత్యంత వేగంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. యజ్ఞ వేదిక, హోమ గుండాలు, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, బ్యారికేడ్లు, భక్తులు కూర్చుని వీక్షించేందుకు మ్యాట్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులను ఆకట్టుకునేలా పుష్ప, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 32 మంది రుత్వికులు రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని వేదాల్లోని మంత్రాలు పఠిస్తూ హోమ కార్యక్రమాలు చేపట్టనున్నారు. పాల్గొనే భక్తులందరికీ యజ్ఞ ఫలం లభించేలా ప్రతి రోజూ ఒకరితో సంకల్పం చెప్పించనున్నారు.

సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు చతుర్వేద మంత్ర పారాయణం నిర్వహిస్తారు. 6 గంటల నుంచి అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భక్తి సంగీత, నృత్య ప్రవచన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. హిందూ ధర్మప్రచార పరిషత్, శ్రీవేంకటేశ్వర వేదాధ్యయన సంస్థ కీలక భూమిక పోషిస్తున్నాయి. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

పలు చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్..
- నిందితులిద్దరూ అన్నదమ్ములు
- 12.50 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుల అరెస్టు, చోరీ సొత్తును చూపిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైం : తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు క్రైమ్ పోలీసులు తెలిపారు. క్రైమ్ డీఎస్పీ రవికుమార్ వివరాల మేరకు.. తిరుపతి గోపాల్ రాజు కాలనీలో నివాసం ఉంటున్న ఆక్కుతి పెంచలయ్య(29), ఆక్కుతి నవీన్(23) అన్నదమ్ములు. వీరిద్దరూ కలిసి నగరంలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడేవారు. 2019 నుంచి ఇప్పటివరకు తిరుపతి పరిసర ప్రాంతాలతో పాటు అలిపిరి, ఎంఆర్‌పల్లె, బైరాగిపట్టిడ, వెంకటగిరి, గూడూరు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ఒంటరిగా వెళ్తున్న మహిళ మెడలలో చైన్లు లాక్కొని వెళ్లేవారు. తొలుత బతుకుతెరువు కోసం తిరుపతిలో ఆటో నడుపుతూ జీవనం సాగించేవారు. డబ్బులు చాలక పోవడంతో దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నారు. మంగళవారం చంద్రగిరి–తిరుపతి మార్గమధ్యంలోని వకుళమాత ఆలయం సమీపంలో వీరిద్దరినీ అరెస్ట్ చేసి, రూ.12 లక్షల 50 వేల విలువ చేసే 252 గ్రాములు బంగారు, 500 గ్రాములు వెండిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై జిల్లాలో పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన సీఐలు ప్రవీణ్ కుమార్, వెంకటేశులు, ఎస్ఐలు, సిబ్బందిని ఆయన అభినందించారు.

బాలకార్మిక వ్యవస్థను అరికట్టాలి



దుకాణాలను తనిఖీ చేస్తున్న కార్మిక శాఖ అధికారులు

రేణిగుంట: బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించి బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని కార్మిక శాఖ సహాయ కమిషనర్ చిన్న లాలెప్ప హెచ్చరించారు. మంగళవారం రేణిగుంటలోని పలు దుకాణాలు, హోటళ్లను ఆయన వివిధ శాఖల సమన్వయంతో కలసి తనిఖీ చేశారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పనిలో కాదని అవగాహన కల్పించారు. తిరుపతి సర్కిల్–2 సహాయ కార్మిక అధికారి శ్రీమన్నారాయణ, అధికారులు రాజయ్య, రంగనాథ్, ఐసీపీఎస్ సిబ్బంది దేవయాని తదితరులు పాల్గొన్నారు.

కండలేరును సందర్శించిన సీడబ్ల్యూఎస్ బృందం

కండలేరును సందర్శించిన సీడబ్ల్యూఎస్ బృందం

రాపూరు: కండలేరు జలాశయాన్ని చెన్నై వాటర్ కమిషనర్ బృందం మంగళవారం సందర్శించింది. కండలేరు జలాశయం నుంచి నీటి విడుదల, ప్రస్తు తం ఉన్న నీటి నిల్వ తదితరాలను తెలుసు కున్నా రు. అనంతరం తెలుగుగంగ అతిథి గృహంలో కండలేరు జలాశం అధికారులతో సమీక్షించారు. ఈ బృందంలో సీడబ్ల్యూఎస్ ఇంజినీర్లు జయకర్ జేసుదాస్, పార్థసారథి, కళైశెల్వం, అజిత్ కుమార్,రాజా, పళనికుమార్, తెలుగు గంగ ఎస్సీ హరినారాయణరెడ్డి, ఈఈ విజయకుమార్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తి, ఇంజినీర్లు తిరుమలయ్య, డీఈలు,ఏఈలు ఉన్నారు.